## క్లుప్తంగా

### రైతుల వివరాల సేకరణ



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**కుల్కచర్ల:** రేషన్‌కార్డు ఉండి రుణమాఫీ వర్తించని రైతుల కోసం సర్వే కొనసాగుతోందని మండల వ్యవసాయాధికారి వీరస్వామి అన్నారు. బుధవారం మండలంలోని రాంరెడ్డిపల్లిలో రైతుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 10వ తేదీ వరకు రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి, అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ వంశీ పాల్గొన్నారు.

### డీజేలు నిర్వహిస్తే చర్యలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

**దౌల్తాబాద్:** వినాయక నిమజ్జన ఉత్సవాల్లో డీజేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రవి గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డీజే నిర్వహించాలనుకునే వారు డీఎస్పీ అనుమతి తీసుకోవాలని చెప్పారు. అనుమతి లేకుండా డీజేలు నిర్వహిస్తే డీజే యజమాని, డ్రైవర్‌పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

### విధుల్లోకి తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

**తాండూరు టౌన్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. రాత్రికిరాత్రే విధుల నుంచి తొలగించడం అన్యాయమని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

### ఎంపీడీఓకు సన్మానం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

**మోమిన్‌పేట:** బదిలీపై వచ్చిన ఎంపీడీఓ విజయలక్ష్మిని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు శాలువతో సన్మానించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది ఆమెను సన్మానించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ల మండల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శంకర్, ఈసీ వికాస్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

**కొడంగల్ :** వికారాబాద్ జిల్లా హెల్త్ సర్వీసెస్ సమన్వయ కర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ ప్రదీప్ బుధవారం కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను గమనించారు. సమస్యలపై వైద్యులతో చర్చించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్ సాకేత్, జయదీప్ రెడ్డి, మైమూనా, పూజ, శ్రావణి, శివ పాల్గొన్నారు.

### మట్టి వినాయకులనే పూజిద్దాం

**అనంతగిరి:** జిల్లాలోని కుమ్మరి కులవృత్తుల వారిని ప్రోత్సహించడానికి, పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కుంభం.ఉపేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మట్టి గణపతులు కావలసిన వారు వికారాబాద్‌లో కుమ్మరి అంజిలయ్య ఫోన్ నంబర్ 9966466982, పరిగిలో 9676038986 ,తాండూరులో 9640 518846, కొడంగల్‌లో 939 16 45200లను సంప్రదించాలన్నారు.

# మట్టి గణపతికే జై!



విక్రయించేందుకు సిద్ధంగా మట్టి గణపతులు

- కాలుష్య రహితం, స్వచ్ఛతకు ప్రతిరూపం
- మట్టి ప్రతిమల వైపు పర్యావరణ ప్రేమికుల మొగ్గు
- కుల్కచర్లలో పెద్ద ఎత్తున మట్టి విగ్రహాల తయారీ

**కుల్కచర్ల:** మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో సైతం మార్పులు వస్తున్నాయి. ప్రకృతిని ప్రేమించే వారు దైవంలో సైతం స్వచ్ఛతను కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఆదిదేవుడైన గణనాథుడిని పూజించే అంశంలో భక్తజనం కాలుష్యానికి దూరంగా ప్రకృతికి దగ్గరగా ఉండే ప్రతిమలను ఇష్టపడుతున్నారు. నేటి యువతరం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలకు దూరంగా స్వచ్ఛమైన మట్టితో తయారు చేస్తున్న మట్టి విగ్రహాలకు ప్రాధాన్యతనిస్తున్నారు.

**కాలుష్య రహితం, స్వచ్ఛతకు ప్రతిరూపం**

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నేటి యువత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి ఇష్టపడుతున్నారు. పెరుగుతున్న కాలుష్యం వల్ల ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, వాతావరణ కాలుష్యం తదితర దుష్ప్రభావాల నేపథ్యంలో కాలుష్యరహిత కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. మట్టితో చేస్తున్న గణపయ్య విగ్రహాలు పూర్తిగా కాలుష్యరహితంగా, ప్రకృతి ప్రేమికులను ఆకర్శిస్తున్నాయి. ఎటువంటి దుష్ప్రభావాలు కల్గించకుండా సాధారణ రంగులు వాడుతూ గ్రామీణ ప్రాంతంలోని అందానికి ప్రతిరూపంగా నిలిచేలా రూపొందించే ప్రతిమ ఏర్పాటకు యువత మక్కువను చూపిస్తున్నారు.

**కుల్కచర్లలో మట్టి ప్రతిమల తయారీ**

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలో గత 12 సంవత్సరాల నుంచి మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. ముఖ్యంగా కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మట్టి వినాయక ప్రతిమలు రూపొందించడమే వ్యాపారంగా మలుచుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఒక్క కులకచర్ల మండలంలోనే సుమారుగా 70వేల విగ్రహాల తయారీ జరుగుతుంది.

**జీవనోపాధిగా మారింది..**



మట్టి వినాయకుల విగ్రహాలు తయారు చేయడం కాలుష్యాన్ని నివారించడమే కాకుండా మాకు జీవనోపాధిగా మారింది. దీంతో మాతో పాటుగా మరి కొంత మందికి ఉపాధిని కల్పిస్తున్నాం. వినాయక విగ్రహాల రవాణా కారణంగా మరో కొంతమందికి పరోక్షంగా లబ్ధిచేకూరుతుంది. మట్టి ప్రతిమలను తయారు చేయడం మానసికంగా ఎంతో సంతోషాన్నిస్తుంది.

– గోపాల్, చాపలగూడెం

**50వేల విగ్రహాలు తయారు చేస్తాం**



ప్రతీ సంవత్సరం దాదాపు 50వేల విగ్రహాలను తయారు చేస్తాం. మనం పూజించే దైవం కాలుష్య రహితంగా ఉండాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. ప్రకృతిని ప్రేమించే పల్లెప్రాంతంలో నివాసించే వాళ్లం.. వ్యాపారంగా బాధ్యతగా వినాయకులను తయారు చేస్తున్నాం.

– కుమ్మరిస్వామి, నిర్వాహకులు

**పట్టణాల్లో భలే గిరాకీ**

మట్టి ప్రతిమలకు పట్టణ ప్రాంతాల్లో భలే డిమాండ్ ఉండటంతో నిర్వాహకులు పట్టణాలకు తరలించి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, సూర్యాపేట్, వరంగల్ వంటి ప్రధాన పట్టణాలకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. పట్టణాల్లో పర్యావరణంపై ఎక్కువ అవగాహన ఉండటంతో యువత మట్టి గణపయ్యలను కొనుగోలు చేయడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు.

**సొంత గ్రామంలోనే 9నెలల ఉపాధి**

మట్టి విగ్రహాల తయారీలో సూమారు 60మందికి ఉపాధి లభిస్తుంది. సంవత్సరంలో తొమ్మిది నెలలు విగ్రహాల తయారీలో స్థానికులకు ఉపాధి లభిస్తుంది.ఇందులో పనిచేస్తున్న వారికి ఒక్కోక్కరికి 500 నుంచి వెయ్యి రూపాయల వరకు కూలీ చెల్లిస్తారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యం



కుల్కచర్ల: మహిళలకు సూచనలు చేస్తున్న సీడీపీఓ

**కుల్కచర్ల:** పౌష్టికాహారం తీసుకోవడంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరంగా ఉంటారని సీడీపీఓ మెహరున్నిసాబేగం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యకరంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, వైద్య సిబ్బంది సుజాత, జంగమ్మ, సూపర్‌వైజర్ యాదమ్మ, అంగన్‌వాడీలు పద్మ, లత, అనసూయ పాల్గొన్నారు.

**ఆకుకూరలు తప్పనిసరి**



బంట్వారం: మాట్లాడుతున్న ధనలక్ష్మి

**బంట్వారం:** గర్భిణులు, బాలింతలు పోషక ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండలంలోని రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. ప్రతి రోజు ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు భోజనంలో తప్పనిసరిగా ఉండాలన్నారు. పోషక ఆహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి తల్లులకు పలు సూచనలు చేశారు. అలాగే, పిల్లల బరువు, ఆకలి నిర్ధారణను పరీక్షించారు. పోషక మాసోత్సవాలు ఈ నెల చివరి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటాయన్నారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ స్వరూప

**ధారూరు:** మండలంలోని కొండాపూర్‌లకాన్ గ్రామంలో వానలకు దెబ్బతిన్న పంటలను బుధవారం వికారాబాద్ ఏడీఏ స్వరూప పరిశీలించారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని కాల్వలు చేసి బయటకు పంపించాలని రైతులకు సూచించారు. లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన కంది, పత్తి పంటలను ముందస్తు జాగ్రత్తలతో కాపాడుకోవాలని పేర్కొన్నారు. పత్తి పంటలో వేరుకుళ్లు రోగం సోకితే కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును మొక్కల మొదళ్ల వద్ద వేసుకోవాలని తెలిపారు. పంట నీటిలో మునిగితే 19:19:19 లేదా యూరియాను లీటర్ నీటికి 10 గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. ఏడీఏ వెంట ఏఈఓ మంజుల మాజీ సర్పంచు పరమేశ్ రైతులు ఉన్నారు.

# తప్పులు లేకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

- ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం

**దోమ:** ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం పేర్కొన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెట్లు, రెవెన్యూ సిబ్బంది, టీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేసి ఈ నెల 21వ తేది వరకు ఉన్నతస్థాయి అధికారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, ఏపీఓ దస్తయ్య, పంచాయతీ రాజ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఓటరు లిస్టులో తప్పులు సరి చేయండి**

**తాండూరు రూరల్:** ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలోని తప్పులను సరి చేయాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు. బుధవారం బీఎల్‌ఓలు, వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. యువతి, యువకులను కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. బీఎల్‌ఓలకు సహకరించి, సలహాలు సూచనలు ఇవ్వాలని వివిధ పార్టీల నాయకులను కోరారు.

### రేపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**అనంతగిరి:** జిల్లాలో ఖాళీగా ఉన్న 12 మెడికల్ ఆఫీసర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన శుక్రవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ హాల్ నందు నిర్వహించనున్నారు. ఎంబీబీఎస్ అర్హత కలిగి తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో తప్పనిసరిగా నమోదై ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

### మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించాలి

**అనంతగిరి:** వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో ఆగస్టు 28న గెస్ట్ లెక్చరర్ ఎంపిక నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. దానిని రద్దు చేసి తిరిగి ఇంటర్వ్యూలు నిర్వహించాలని అభ్యర్థి సురేందర్ డిమాండ్ చేశారు. బుధవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అదనపు సంచాలకులకు వినతిపత్రం అందజేశారు. మొత్తం తొమ్మిది పోస్టులకు ఆరుగురిని రిటైర్డు ఉద్యోగులను ఎంపిక చేయగా, మరో ముగ్గురు ఎంపికలో నిర్ణేతల పక్షపాతం బంధుప్రీతితో ఎంపిక చేశారని ఆరోపించారు.

### సమర్థవంతంగా నర్సరీ నిర్వహణ

ఎంపీడీఓ విశ్వప్రసాద్

**తాండూరు రూరల్:** గ్రామాల్లో వన నర్సరీ నిర్వహణ సమర్థవంతంగా ఉండాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి బుధవారం నర్సరీలో ఉన్న మొక్కలకు ఎరువులు వేయాలని ఆదేశించారు. మొక్కల సైజ్‌ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. మండలంలో 33 నర్సరీలు ఉన్నాయని.. వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నరోత్తంరెడ్డి, ఈసీ మధుసూదన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### పంచాయతీ ఏర్పాటుకు కృషి

**దోమ :** తమ తండాను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఊటుపల్లి తండావాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహేశ్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాలను అనుబంధ గ్రామాలు ఉంచడం వలన అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడి నాలాలు అక్కడే పెరుకుపోవడంతో పాటు సీసీలు లేక రోడ్లు నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి తమ తండాను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ గోపాల్, తండా వాసులు వినోద్, శివ, సురేశ్, రాజేందర్, రాజు, గణేశ్, సంతోష్, శంకర్, మోహన్ పాల్గొన్నారు.

# పంటల రక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి

- ఏఆర్‌సీ శాస్త్రవేత్త యమునారెడ్డి



వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

**యాలాల:** వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త యమునారెడ్డి, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ లక్ష్మణ్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటల్లో భారీగా వరదనీరు చేరిందన్నారు. పత్తి పంటలో సాళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికవర్షం కారణంగా పత్తి రంగు మారకుండా ఉండేందుకు మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక పంట ఎదుగుదల కోసం 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేయాలన్నారు. పత్తికి వేళ్లకు తెగులు సోకకుండా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ లీటరు నీటిలో కలిపి తెగులు సోకిన మొక్క భాగంలో వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో వర్షం కారణంగా అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని, నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు, మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



పెంటయ్యను పరామర్శిస్తున్న మహేశ్ రెడ్డి

**కుల్కచర్ల:** బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, పేదలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మందిపల్ గ్రామానికి చెందిన సాలె పెంటయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు తాము అండగా ఉంటామని ఎవరూ అధైర్యపడొద్దన్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సౌకర్యాలపై పోరాటం చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు మఠం రాజశేఖర్, చెన్నయ్య, వెంకటయ్య, నబి పాల్గొన్నారు.

# ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై మహిపాల్‌రెడ్డి

- ఎస్సై మహిపాల్‌రెడ్డి

**బంట్వారం:** గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల వద్ద రాత్రి వేళ ఒక్కరు కచ్చితంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిమజ్జన సమయంలో చిన్న పిల్లలను నీటి వద్దకు రానివొద్దన్నారు. నిమజ్జనం రాత్రి వేళ కాకుండా పగలే పూర్తి చేసేలా చూసుకోవాలన్నారు. అలాగే, వినాయకుల ప్రతిష్ఠాపనకు సంబంధించి ప్రతి ఒక్కరు పోలీస్ పోర్టల్‌లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి

- మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి



పూజలు చేస్తున్న బాల్‌రెడ్డి, తదితరులు

**తాండూరు రూరల్:** ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పటోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెంగోల్ గ్రామంలో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం ముగింపు పూజలు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. భగవంతుడి దయ వల్ల రైతులు బాగుండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ పవన్‌తో పాటు కానిస్టేబుళ్లు కూడా పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, తులసిరామ్, ఆలయ కమిటీ సభ్యులు హన్మయ్య, వెంకటేశం, రాముయాదవ్, నారాయణరెడ్డి, జయంతు ,నర్సింలుతో పాటు వివేకానంద సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

**అనంతగిరి:** భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఏపీఓ శీను, ఎంపీఓ దయానంద్, గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ అంగన్‌వాడీలో ప్రీస్కూల్ విద్య**

**తాండూరు రూరల్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యను ప్రభుత్వం అమలు చేసేందుకు కృషి చేస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల అంగన్‌వాడీలకు ప్రీ స్కూల్ విద్యకు సంబంధించిన సామగ్రిని టీచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ.. తాండూరు ఐసీడీఎస్ పరిధిలో 279 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను, మొదటి విడతగా 45 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అంగన్‌వాడీలకు పెయింటింగ్‌తో పాటు నేమ్ బోర్డులను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆపరేటర్ ప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

**◆ మండపాలకు అనుమతి తప్పనిసరి**

**దోమ :** గణేశ్ విగ్రహాలకు ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, యువజన సంఘ నాయకులకు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డీజేలకు ఎలాంటి అనుమతులు ఉండవని, పెడితే సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**◆ జాగ్రత్తలు తప్పనిసరి**

**మోమిన్‌పేట:** వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ప్రధాన పార్టీల నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వినాయకులను ప్రతిష్ఠించేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ కనెక్షన్ తీసుకొనే ముందు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు .

**◆ నూతన కార్యవర్గం ఎంపిక**

**మోమిన్‌పేట:** మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉందన్నారు. మండల శాఖ నూతన అ ,ధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, ప్రధా న కార్యదర్శిగా దండు రమేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రభాకర్, కార్యదర్శి విరేశం, మహిళా ఉపాధ్యక్షురాలు జ్యోతిని ఎన్నుకొన్నట్లు తె లిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు, కార్యదర్శులు మల్లేశం, నాగేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

**◆ బీటీ, డబుల్ రోడ్ల పనులు ప్రారంభం**

**బొంరాస్‌పేట:** సీఎం ఇలాకాలో అభివృద్ధికి పనులు జోరందుకున్నాయి. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి–కొత్తూరు రోడ్డుకు ఇరవై ఏళ్లుగా ఎదురుచూస్తున్న డబుల్ రోడ్డుకు మోక్షం లభించింది. రూ.3.10కోట్ల నిధులతో 2కి.మీ. బీటీ, డబుల్ పనులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఇందులో కడా అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డీఈ, ఏఈలు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.